ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
మంగళవారం 29 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 4 pm

# మేడ్చల్‌లో భారీ అగ్ని ప్రమాదం

**కేకేసి ఎలక్ట్రికల్స్ ఫ్యాన్ తయారీ పరిశ్రమలో ప్రమాదం**

**మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది**

మేడ్చల్ : మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలో బాసరగాడిలో గల కేకేసి ఎలక్ట్రికల్స్ ఫ్యాన్ తయారీ పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ప్రమాదం జరిగిన ప్రాంతానికి వచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



అయితే, మంటలు వ్యాపించడంతో చుట్టూ పక్కల భారీగా పొగ అలుముకుంది. కానీ, ప్రమాద సంఘటన గురించి తెలిసి కూడా ఇప్పటి వరకు కేకేసీ ఎలక్ట్రికల్స్ ఫ్యాన్ తయారీ పరిశ్రమ యాజమాన్యం అందుబాటులోకి రాలేదు. వారు రావడానికి మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సమాచారం. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై ఆస్తినష్టం ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. అయితే, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన కొత్త సీఎస్

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ రామకృష్ణా రావు ఇవాళ ఆయన ప్రగతి భవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణా రావుకు డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. 1991 ఐఏఎస్‌కు బ్యాచ్‌చెందిన రామకృష్ణా రావు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ క్రమంలోనే సుదీర్ఘ కాలం ఆర్థిక శాఖలో చేసిన ఆయన సేవలను గుర్తించిన సర్కార్ అనుభవం దృష్ట్యా రామకృష్ణా రావును సీఎస్‌గా నియమించింది. గతంలో ఆయన నల్లగొండ జాయింట్‌కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా కూడా పని చేశారు.



# గణేష్ శర్మకు ప్రణామాలు





**కంచి కామ కోటిపీఠం ఆచార్యులుగా .. అక్షయ తృతీయ రోజు అభిషేక వేడుక ఇదొక జ్ఞాపకం.. సీఎం రేవంత్ రెడ్డి**

చెన్నై : కంచి కామకోటి పీఠం ఆచార్యుల అభిషేక వేడుక తెలంగాణ ప్రజలకి మధుర జ్ఞాపకం కాబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారతదేశంలో ఉన్న అష్ఠదశ మహ శక్తి పీఠాలలో తమిళనాడు కాంచీపురానికి చెందిన కంచి కామకోటి పీఠం కూడా ఒకటి. ఇది ఒక విజ్ఞాన కేంద్రంగా, వేద విద్యాకేంద్రగా విలసిల్లుతూ ఉంది. అయితే కంచికామ కోటి పీఠం ఆచార్యులుగా తెలంగాణ ప్రాంతానికి ఆధ్యాత్మిక సేవలు అందించిన దుడ్డు సత్య వెంకట సూర్య గణేష శర్మ అభిషిక్తులు అవుతున్నారు. కంచి కామకోటి పీఠం 71వ ఆచార్యులుగా దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేష శర్మ అభిషేక వేడుక శుభ సందర్భంగా రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. గణేష శర్మ ఋగ్వేద పండితులుగా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవికి, తెలంగాణ ప్రాంతానికి ఎలలేని ధార్మిక సేవ చేశారని పేర్కొన్నారు.

సనాతన ధర్మ గురుపరంపరకు, భక్తి తత్వానికి, జ్ఞాన మార్గానికి బాటలు వేసే ఈ వేడుక తెలంగాణ ప్రజలందరికీ మధుర జ్ఞాపకం కాబోతోందన్నారు. ఇక మంగళకరమైన అక్షయ తృతీయ రోజున జరగనున్న ఈ అభిషేక వేడుక సందర్భంగా కంచి కామకోటి పీఠానికి తెలంగాణ ప్రజల తరపున సీఎం ప్రణామాలు తెలియజేశారు. ఈ గురుపరంపర ధర్మాన్ని, జ్ఞానాన్ని, శాంతిని మానవాళికి ఎల్లప్పుడూ అందించాలని ఆకాంక్షించారు.

# 'కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు




హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ప్రస్తుత గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఈ ఏడాది మే 31 వరకు గడువు పెంచుతూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 100రోజుల్లో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని తొలుత 2024 మార్చి లో ప్రభుత్వం కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఆయా కారణాలతో విచారణ కంటిన్యూ అవుతుంది. ఇప్పటికే పలు సందర్భాల్లో గడవు పొడిగించిన ప్రభుత్వం తాజాగా మరోసారి పెంచింది. ప్రస్తుతం విచారణ కీలక దశకు చేరుకుంది. దాదాపు 90 శాతం నివేదిక సైతం కమిషన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తుది దశ విచారణలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొంతమంది పెద్ద నాయకులను కూడా పిలిచే అవకాశముందని తెలుస్తోంది.

# రేపు బెజవాడకు సీఎం రేవంత్

**దేవినేని ఉమా కుమారుడు వివాహానికి హాజరు కానున్న ముఖ్యమంత్రి**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బుధవారం రోజు విజయవాడ వెళ్లనున్నారు.. బెజవాడలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు వివాహానికి హాజరు కాబోతున్నారు. ఈ పర్యటన కోసం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు.. ఉదయం 10.40 గంటలకు కానూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుంటారు.. ఉదయం 10.50 గంటల నుండి 11.30 గంటల వరకు దేవినేని ఉమా కుమారుడు వివాహానికి హాజరై.. వధూవరులను ఆశీర్వదించనున్నారు.. మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు.

గత వారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. తన కుమారుడు వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందించి రావాల్సిందిగా ఆహ్వానించారు.. మరోవైపు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో పనిచేసిన రేవంత్ రెడ్డి.. దేవినేని ఉమాతో సన్నిహితంగా ఉండేవారు.. ఆ తర్వాత పార్టీ మారి.. తెలంగాణ సీఎం అయినా.. వారి మధ్య స్నేహ బంధం కొనసాగుతోంది.. దీంతో, మిత్రుడి ఆహ్వానం మేరకు ఆయన కుమారుడి వివాహానికి హాజరు కాబోతున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా వివాహానికి హాజరు అయ్యే అవకాశం ఉంది.





## కేసీఆర్ ఏ టైంకి, ఎట్లా రావాలో

# అసెంబ్లీకి వస్తారు..

**బీఆర్ఎస్ సభ చూసి కాంగ్రెస్కు వణుకు పుట్టింది**

**ఈ పార్టీ తెలంగాణకు విలనే : మంత్రి జగదీష్ రెడ్డి**



హైదరాబాద్ : తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరు విలన్ గానే తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 16 నెలల్లో సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. ఒక్క ఏడాదిలోనే గురుకుల పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు చనిపోయారు అని చెప్పుకొచ్చారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ఈ రోజు వరకు ఎంత ధాన్యం కొన్నారో లెక్క చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఎన్ని వడ్లు కొన్నారు?.. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలన్నారు. కేసీఆర్ మీద ఎందుకు ఏడుస్తున్నారు.. కేసీఆర్ మీకు సంవత్సరం పైనే సమయం ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ ఏ టైంకి, ఎట్లా రావాలో అసెంబ్లీకి వస్తారు.. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని జీవో ఇచ్చారు.. 41 వేల కోట్లు రుణమాఫీ అని చెప్పి 21 వేల కోట్లు చేశామని చెప్పారు.. ఇప్పుడు రైతు రుణమాఫీ పూర్తి అయిందని అంటున్నారు..

# మెహదీపట్నంలో అక్రమ కట్టడాల కూల్చివేత

హైదరాబాద్: అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. మెహదీపట్నంలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేస్తున్నారు. అక్రమ పార్కింగ్, అనుమతి లేకుండా కట్టిన కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు.



# తెలంగాణలో ప్రశాంతతకు కాంగ్రెస్సే కారణం

**పదేళ్లలో లేని స్వచ్ఛ ఇప్పుడు అనుభవిస్తున్నారు**

**రుణమాఫీ విషయంలో ఎవరు గొప్పొ ప్రజలే చెబుతారు**

**కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి**

హైదరాబాద్ : తెలంగాణలో ప్రశాంతతకు కారణం కాంగ్రెస్ అని, పదేళ్లలో లేని స్వేచ్ఛను ప్రజలు ఇప్పుడు అనుభవిస్తున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ నేతలపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోతున్నారని, ఈ ప్రశాంతతకు కారణం ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ గవర్నమెంట్‌ను తెచ్చుకోవడమేనని స్పష్టం చేశారు. ఇక రైతులకు రూ.500 బోనస్ గురించి స్పందిస్తూ గత ప్రభుత్వంలో కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. రైతుకు 5 ఎకరాలుంటే 75 వేలు వస్తున్నాయని, ప్రభుత్వం ఇచ్చే రూ.500 తో రైతుకు 50 వేలు ఎక్స్ట్రా వస్తుందని తెలిపారు. 5 ఎకరాలు ఉన్న రైతుకు బోనస్‌తో కలిపి 75 వేలు వస్తుందంటే హ్యాపీయే కదా అని వ్యాఖ్యానించారు. అంతేగాక రైతు రుణమాఫీ విషయంలో ఎవరు శభాష్ అనేది ప్రజలే చెబుతారని. పదేళ్లలో రూ. 20 వేల కోట్లు రుణమాఫీ గొప్పనా.. ఒకటే సంవత్సరంలో రూ.22 వేల కోట్ల రుణమాఫీ చేయడం గొప్పా చెప్పాలని కాంగ్రెస్ నేత అన్నారు

